క్లుప్తంగా

రైతులకు విత్తనాల పంపిణీ



తానాంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ దేవి

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తానాం గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ పిలుపునిచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీతో కూడిన వరి విత్తనాలను శనివారం సర్పంచ్ కన్నూరు దేవి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాధరావు, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, వార్డు సభ్యులు రొంగలి దేవి, పైల జానకిరావు, పైల కుమారి, వర్రి వెంకటరమణ, లలితదేముడు బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్ నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. హనుమాన్‌నగర్, జాలారిపేట, సమ్మంగిపాలెం, మంగప్పయ్య గారి గ్రామాల భక్తులు ఆరాధ్య దైవంగా కొలిచే స్వామి వారికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఉంటుందని తెలియజేశారు. పరిసర గ్రామాల ప్రజలు తరలిరావాలని కోరారు.

తిరుపతికి కుర్తాళం పీఠాధిపతి పయనం



తిరుపతికి పయనమైన సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగియడంతో శనివారం ఉదయం కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని తిరుపతికి పయనమయ్యారు. అక్కడ నుంచి వారణాశికి తరలివెళ్లి సిద్ధేశ్వరి పీఠంలో కొద్ది రోజుల పాటు స్వామీజీ వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా జూలై 6 నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు కనులపండువగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై అధిష్టింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు, అక్షింతలను అందజేశారు.

ఘనంగా సహస్ర నామార్చన

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలను పఠిస్తూ స్వామి వారికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం అనంతరం సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

ఆడదూడలతో పాడి రైతులకు లక్ష్మీకళ

తగరపువలస: పాడిరైతుల ఇంట ఆడ దూడ పెయ్యలు జన్మిస్తే లక్ష్మీకళ ఉట్టిపడినట్టేనని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఆడ దూడ పెయ్యల ఉత్పత్తి పథకాన్ని ఆనందపురంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో మేలుజాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల ఆడ పెయ్యలను ఉత్పత్తి చేసి పాల దిగుబడి పెంచవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క కృత్రిమ గర్భధారణకు రూ.675 చెల్లించాల్సి వుంటుందన్నారు. లింగనిర్ధారిత వీర్యనాళికలను రెండు సార్లు కృత్రిమ గర్భధారణకు సబ్సిడీపై అందించనున్నట్టు తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యనాళికలలో ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, షాహివాల్ మొదలైనవి అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మొదటి విడతగా 73 కేసులను గుర్తించామన్నారు. కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని వినియోగించుకుని కచ్చితమైన కేసులను గుర్తించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు కుష్టువ్యాధిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఆశ కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సత్యవేణి, నోడల్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 204 కేసుల పరిష్కారం

భీమునిపట్నం : భీమిలిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 204 కేసులు పరిష్కారమయ్యాయి. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 135 కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి డి.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 69 కేసులు పరిష్కారమయ్యాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమాల్లో భీమిలి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎంపీ పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎం.సుధాకర్, కోశాధికారి ఎం.సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

7న లతారాజా ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పరీక్ష



స్కాలర్‌షిప్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సిద్ధోజీరావు, రాజా

అల్లిపురం: విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో దేశవ్యాప్తంగా విశిష్ట సేవలందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన లతా రాజా ఫౌండేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్‌లు అందించనుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.కె. రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్‌కు సంబంధించిన పరీక్ష జూలై 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ట్రస్టీ డాక్టర్ సిద్ధోజీరావు మాట్లాడుతూ కె.కె. రాజా సతీమణి లత జ్ఞాపకార్థం ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్య, వైద్యం, సామాజిక రంగాలకు అంకితమై నిస్వార్థ సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ప్రతి ఏడాది జాతీయ సేవా ధార్మిక పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగి ఉత్సాహం గల యువతీ యువకులు 9866870179, 8142657359 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ ఎస్.సిద్ధోజీరావు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్ రక్తదాన శిబిరం నేడు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి శివకుమార్ తెలిపారు. ఉక్కునగరం క్లబ్, విశాఖ బ్లడ్ సెంట ర్ సహకారంతో ఉక్కునగరం క్లబ్ పార్టీ హాల్ -3లో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న శిబిరానికి వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఆపదలో ఉన్నవారి కి ప్రాణదానం చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న బీవీపీ ప్రతినిధులు

అల్లిపురం: రక్తహీనత వల్ల మహిళల్లో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రతి మహిళా తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కేజీహెచ్ వైద్యురాలు డాక్టర్ డి.లక్ష్మీ తులసి అన్నారు. ఎంవీపీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్, పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బిడ్డ పుట్టే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రతినిధులు మహిళలకు విటమిన్ టాబ్లెట్లు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్ సెట్లు, చాక్లెట్లు, బిస్కట్లు అందజేశారు. పరిషత్ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ జైన్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేవీ సత్యవేణి, పరిషత్ ప్రతినిధులు సీహెచ్‌వీ సత్యనారాయణ, పి.షర్మిల, ఎంవీ రాజశేఖర్, కె. రామ్‌కుమార్, పి.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్ ఎంతో ఉపయోగకరం

మల్కాపురం : యువతలో ఆచరణాత్మక నాయకత్వానికి,సాంకేతిక పరిజ్ఞానానికి మై భారత్ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి అన్నారు.మల్కాపురం సెయింట్ మహిళ కళాశాల వద్ద యువజన సదస్సు శనివారం జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆమె ఈ నెల 24వ తేదీన గీతం కళాశాలలో మై భారత్ పోర్టల్ పై సీనియర్ ప్రోగ్రాం అధికారి అనసూయ దేవితో కలిసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు. శిక్షణలో తాము నేర్చుకున్న అంశాలు నేటి యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయన్నారు. యోగ, స్వచ్ఛభారత్, పర్యావరణ పరిరక్షణ మొదలగు విషయాలు మై భారత్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



సదస్సుకు వచ్చిన అతిథులు

గిరిప్రదక్షిణకు రహదారుల ముస్తాబు



రోడ్డును శుభ్రం చేయిస్తున్న జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రారంభం కానున్న గిరిప్రదక్షిణ కోసం జీవీఎంసీ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. గిరిప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం, వారు నడిచే రహదారులను బాగుచేస్తున్నారు. స్టేడియం వెనుక వైపు గల రహదారులను శుభ్రపరస్తున్నారు. రోడ్డుకిరువైపులా గల ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. 45వ వార్డులోని సాలగ్రామపురం, వరాహగిరి కాలనీ, సత్యసాయినగర్, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కొండవాలు ప్రాంతాల్లో శనివారం దారిపొడువునా రహదారిని వెడల్పు చేస్తూ, విశాలంగా చేశారు. జీవీఎంసీ జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ లీలాప్రసాద్, మేస్త్రీ సుభాన్‌లు పనులను పర్యవేక్షించగా, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీపీసీ భూ నిర్వాసితులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ భూ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును నిర్వాసితులు కోరారు. నిర్వాసిత నాయకుడు వెలుగుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సింహాద్రి భూ నిర్వాసితులు శనివారం ఆయన్ను కలసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీలో ఉపాధి పొందేందుకు 2010లో పరీక్షలు రాసిన నిర్వాసిత యువకుల్లో కొందరికి అప్పట్లో ఉపాధి కల్పించి, మిగిలిన వారికి నేటివరకు ఉద్యోగావకాశాలు కల్పించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న నిర్వాసిత యువతకు ఎన్టీపీసీలో శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎన్టీపీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల హామీ ఇచ్చారని నిర్వాసిత నాయకుడు అనిల్‌కుమార్ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు రమణ (ఫైల్)

అల్లిపురం : ఈ నెల 24న చినముషిడివాడకు చెందిన రమణ అనే వ్యక్తి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి, లలితా జ్యూయలర్స్ బస్టాపు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కొంత మంది గుర్తించారు. దాంతో టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేసి అంబులెన్స్‌లో ఆ వ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను ఈ నెల 26వ తేదీన మరణించాడు. చనిపోయిన వ్యక్తిది చిన ముషిడివాడ అని, అతనికి ఇద్దరు కుమారులున్నారని, వారు పోర్టులో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం అందింది. చనిపోయిన వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి, 5.5 అడుగుల ఎత్తు, చామన ఛాయతో, నీలం రంగు షర్ట్ మీద నల్లరంగు గీతలున్న ఫ్యాంట్ వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9490391090, 0891-2783672 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

విద్యార్థుల చదువు.. భవితకు వెలుగు



మధురానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు

సీతంపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ప్రభుత్వ పాఠశాలలే అని ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్, మండల విద్యా శాఖ అధికారులు డి.రామారావు, బాలామణి అన్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో శనివారం 'నేను బడికి పోతా' ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యా శాఖ ఏఎస్‌వో గీత, ఏపీవో అప్పలనాయుడు, హెచ్ఎం బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ కలిసి ర్యాలీ చేశారు. మధురానగర్, శాంతిపురం, రాజేంద్రనగర్, సీతంపేట ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలో బడి బయట ఉన్న నలుగురు విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలు, అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య పరీక్షలు, స్టూడెంట్ కిట్, ఇంగ్లిష్ మీడియం బోధన, ఇతర విద్యా ప్రమాణాలను వివరించి బడిలో చేర్పించాలని కోరారు. కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేరాలని, వారి బంగారు భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని బడికి పంపించాలని కోరారు.

రూ.1.27 కోట్లకు వేములవలస డైలీ మార్కెట్ వేలం

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ వేలం పాటను శనివారం నిర్వహించగా 9 మాసాలకు వెన్ని శంకరరావు అనే వ్యక్తి సీల్డ్ కవర్ ద్వారా రూ.1,27,00,998 అధిక మొత్తానికి సొంతం చేసుకున్నాడు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వేములవలస గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తొలుత బహిరంగ వేలం నిర్వహించగా కోరాడ శ్రీనివాసరావు అనే వ్యక్తి రూ.1.07 కోట్లకు హెచ్చు పాటదారునిగా నిలిచాడు. ఈ బహిరంగ వేలంలో రూ.22 లక్షల వంతున డిపాజిట్ చెల్లించి నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. అనంతరం నలుగురు వ్యక్తులు దాఖలు చేసిన సీల్డ్ కవర్లను ఓపెన్ చేయగా వెన్ని శంకరరావు అధిక మొత్తానికి కోట్ చేయడంతో ఆయనకు పాట ఖరారు చేశారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకు పాటదారుడు డైలీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పాటదారుడు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వుంటుంది. ఒక వేళ హెచ్చు పాటదారుడు వేలం పాటను రద్దు చేసుకోదలిస్తే గ్రామ పంచాయతీకి రూ.2 లక్షలు చెల్లించి రెండో హెచ్చు పాటదారునికి ఇవ్వాల్సి వుంటుంది. నామినేషన్లలో పాల్గొన్న పాటదారుల నుంచి 1 శాతం లేబర్‌సెస్ వసూలు చేయనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో పూర్తయిన పనులు

- సెక్షన్‌లో రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు
- పరీక్షలు, స్పీడ్ ట్రయల్ విజయవంతం



దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్ సుహోమోయ్



మోటార్ ట్రాలీపై పరీక్షలు చేస్తున్న అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కీలకంగా ఉన్న డబ్లింగ్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన పనులను ఉన్నతాధికారులు వెంటవెంటనే తనిఖీలు కూడా చేస్తున్నారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన దంతేవాడ- కమ్లూర్ డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో శనివారం రైల్వే సేఫ్టీ(ఈస్టర్న్ సర్కిల్) కమిషనర్ సుహోమోయ్ మిత్ర, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరీక్షించారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో ఈ తనిఖీలు చేపట్టారు. దంతేవాడ-కమ్లూర్ స్టేషన్‌ల మధ్య మోటార్ ట్రాలీలపై ట్రాక్ అసెస్‌మెంట్స్, రైల్వే స్టేషన్స్, నూతన సిగ్నలింగ్ వ్యవస్థ, దంతేవాడ వద్ద డంకిని నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిలను పరిశీలించారు.

రవాణా మరింత వేగవంతం

స్పీడ్ ట్రయల్ కూడా విజయవంతంగా పూర్తయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల్లో ఈ రెండో లైన్‌ను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ డబ్లింగ్ లైన్ వల్ల చత్తీస్‌ఘడ్-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా మరింత వేగవంతం కానుంది. బైలడిల్ల నుంచి విశాఖపట్నం పోర్ట్‌లకు ఇనుప ఖనిజం రవాణా మరింత వేగంగా, ఎక్కువగా సాగనుంది. పర్యటనలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) ఎస్.శ్రీనివాస్, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) డి.శ్రీనివాసరావు, ఇతర డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.